# 47

# ఫలించిన ఎత్తు

ఒక ఊరిలో కోటీశ్వరుడైన ఒక వ్యాపారి ఉండేవాడు.

ఆయనకి ఎంతో అందమైన భార్య ఉండేది. అయినా... అతను ప్రతిరోజూ చీకటి పడ్డాక ఊరిలోని షోకిల్లా అమ్మాయిల దగ్గరకి పోయి సరదాగా గడుపుతుండేవాడు. అలా చేయవద్దని భార్య ఎంతో వేడుకున్నా వినేవాడు కాదు.

అతని ప్రవర్తనతో విసిగిపోయిన ఆ ఇల్లాలు- భర్తని లొంగదీసుకోడానికి ఒక యెత్తు వేసింది.

ఒకరోజు ప్రొద్దున భర్త ఊళ్ళోకి వెళ్లగానే ఆమె ఎంతో అందమైన దుస్తులతో, నగలతో ముస్తాబయింది. చక్కగా సింగారించుకుని, వచ్చే పోయేవారి వంక చిరునవ్వుతో చూస్తూ కిటికీ దగ్గర నుంచుంది.

ఆమె అందం చూసి దారిన పోయేవాళ్ళు ఆకర్షితులయ్యారు. షోకిల్లా కుర్రాళ్ళయితే ఆమె దగ్గరకి వచ్చి సరసాలాడాలని ప్రయత్నించారు. ఈ విధంగా మూడు నాలుగు రోజులు గడిచాయి. కొందరు యువకులతో ఆమెకి చనువు ఏర్పడింది.

ఒకరోజున నలుగురు కుర్రాళ్ళని ఎవరూ చూడకుండా విడివిడిగా పిలిచి- 'ఆ రోజు చీకటి పడ్డాక ఫలానా సమయంలో తన ఇంటికి రమ్మనమని, సరదాగా గడపవచ్చు...' నని చెప్పింది. అయితే... ఒక్కొక్కరి రాకకు అరగంట వ్యవధి వుండేటట్లు జాగ్రత్తపడింది.

ఆ సాయంత్రం చీకటి పడగానే చెప్పిన సమయానికి మొదటి యువకుడు వచ్చాడు.

అతను రాగానే ఆతిథ్యం ఇస్తున్నట్లుగా అతని ముందు ఓ కంచంలో మిరియంపొడితో కలిపిన అన్నాన్ని, అందులో నంచుకోడానికి ఒక పెద్ద చెంచాడు ఉప్పునీ పెట్టింది. ఆమెతో సరదాగా గడపాలని అతను వచ్చాడుకాని, ఆ దారుణమైన అన్నాన్ని తినడానికి కాదుగా! అయినా...



ఆమె బలవంతం మీద కాదనలేక, ఆ అన్నాన్ని అతి కష్టంమీద నెమ్మది నెమ్మదిగా తినలేక తినలేక తినసాగాడు.

ఆ యువకుడు ఆ అన్నాన్ని సగమైనా తిన్నాడో, లేదో... బయట తలుపు కొట్టిన శబ్దం వినిపించింది. ఆ చప్పుడు వినగానే వ్యాపారి భార్య- "అయ్యో... ఇప్పుడేం చెయ్యాలి? అనుకోకుండా నా భర్త వచ్చేసాడు. మనల్ని చూశాడంటే చంపేస్తాడు. నువ్వు పోయి అటక మీద మూలగా దాక్కో. సమయం చూసి బయటకు పంపించేస్తాను" అంది.

ఆ యువకుడు కంగారుగా అటకపైకి పోయి దాక్కున్నాడు.

ఆ వచ్చింది వ్యాపారి కాదు. రెండో యువకుడు.

మొదటివాడు అటక మీద దాక్కున్నాక- వ్యాపారి భార్య వెళ్లి అతనికి తలుపు తీసింగి.

అతనికి కూడా మొదటివానికి మల్లేనే మిరియాల అన్నాన్నీ, ఉప్పు గడ్డనీ పెట్టింది. అతనూ దానిని తినలేక అవస్థ పడుతుండగానే.., మరో అరగంటలో మళ్ళీ తలుపు చప్పుడయింది.

ఈ సారి మూడోవాడు. అలాగే ఆ తర్వాత నాలుగవ వాడూ వచ్చారు. వీరందరినీ అటక మీద దాచింది ఆమె.

నాలుగవవాడు వచ్చిన తర్వాత మామూలుగా వ్యాపారి వచ్చాడు.

అతన్ని చూడగానే వ్యాపారి భార్య పెద్దపెట్టున ఏడవసాగింది.

అది చూసి వ్యాపారి కంగారుపడి, "ఏమి జరిగింది?" అని అడిగాడు.

"ఏమి చెప్పను ? మీరు రోజూ రాత్రిళ్ళు బయటకు పోతున్నారు. చీకటి పడ్డాక ఈ ఇంట్లో దెయ్యాలు తిరుగుతున్నాయి. ఆ భయంతో నా ప్రాణాలు పోతున్నాయి" అంటూ ఇంకా బిగ్గరగా ఏడవసాగింది.

వ్యాపారికి భార్య మాటల మీద నమ్మకం కలుగలేదు. అయినా- ఆమెని ఓదారుస్తూ "ఈ ఇంట్లో దెయ్యాలు తిరుగుతున్నట్లు నువ్వు నిరూపిస్తే నేను రాత్రిళ్ళు బయటకు పోకుండా నీ దగ్గరే ఉంటాను" అని మాటిచ్చాడు.

"ఈ రాత్రి నేను నిరూపిస్తాను" అని చెప్పింది ఆమె.

వ్యాపారి భోజనం చేసి నిద్రపోడానికి మంచం మీద పడుకున్నాడు .

అటక మీద దాక్కున్న నలుగురికి మిరియాల అన్నం మూలంగా పొట్టలో మంట, నెప్పీ వచ్చి బాధపడసాగారు. దానికితోడు- ఉప్పు ఎక్కువగా తినడంవల్ల దాహంతో నాలిక పిడచ కట్టుకుపోయింది.

ఈ బాధ భరించలేక వారు మూలుగుతూ అటక మీద అటూ ఇటూ ప్రాకసాగారు. వీరి కదలికల మూలంగా చెక్కతో చేసిన అటక దడదడ లాడసాగింది.

ఈ శబ్దాలు విని 'అవి దయ్యాల చేష్టలే...'నని భయపడి మూర్ఛపోయాడు వ్యాపారి.

భర్త మూర్ఛపోయిన సమయంలో వ్యాపారి భార్య తలుపు తీసి ఆ నలుగురినీ ఒకరి తరువాత ఒకరినీ బయటకి పంపించివేసింది. వాళ్ళు 'బ్రతుకుజీవుడా...' అంటూ బయటపడి పరుగులు తీశారు.

ఆ తర్వాత వ్యాపారికి తెలివి వచ్చింది. భార్య చెప్పింది నిజమేనని , ఇంకెప్పుడూ రాత్రిళ్ళు ఆమెని వదిలి వెళ్ళనని మాటిచ్చాడు.

★★★